క్లుప్తంగా

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



బాల్కొండ: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి అన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వ్యాపార, వాణిజ్య సంస్థల వద్ద వ్యాపారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై జీలుగ విత్తనాల పంపిణీ

రెంజల్: మండలంలోని రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలను అందిస్తున్నట్లు వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న 30 కిలోల జీలుగ విత్తనాల బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందని పేర్కొన్నారు. బస్తా పూర్తి ధర రూ. 2790 ఉండగా 60 శాతం రాయితీ రూ. 1674 పోను రైతులు రూ.1116 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు దూపల్లి, రెంజల్ గ్రామాల్లోని సొసైటీల్లో 83 బస్తాల చొప్పున అందుబాటులో ఉన్నాయని వివరించారు. అవసరమైన రైతులు వ్యవసాయ విస్తీర్ణ అధికారుల వద్ద పర్మిట్లు తీసుకుని సొసైటీల నుంచి తీసుకునాలన్నారు. అవసరం మేరకు జిల్లా కార్యాలయం నుంచి తెప్పిస్తామని పేర్కొన్నారు.

18న లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పెద్ద బజార్‌లో ఉన్న లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని ఈ నెల 18న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు శ్రీనివాస చారి గురువారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

రాజేశ్వర్ సేవలు చిరస్మరణీయం

బోధన్: సీనియర్ నాయకుడు బుద్దె రాజేశ్వర్ గ్రామాభివృద్ధికి, ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్బగోని లక్ష్మీనర్సయ్య గౌడ్ అన్నారు. సాలూర గ్రామానికి చెందినీ సీనియర్ నాయకుడు, బోధన్ ఎంపీపీ సావిత్రి భర్త బుద్దె రాజేశ్వర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా ఆయన గురువారం పరామర్శించారు. రాజేశ్వర్ చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. ఆయన వెంట సలీంబేగ్, ఫత్తేపూర్ మాజీ సర్పంచ్ అమీర్, గ్రామ పెద్దలు ఇల్తెపు బొర్ర గంగయ్య, కుటుంబ సభ్యులు ఉన్నారు.

కబడ్డీ జట్ల ఎంపిక



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం అండర్-16 జూనియర్, సబ్ జూనియర్, అండర్-20 కబడ్డీ జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 18 నుంచి జూన్ 1 వరకు సమ్మర్ స్పెషల్ క్యాంపు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు లింగయ్య, ప్రధాన కార్యదర్శి గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు రాజుకుమార్, మల్లేశ్, పీఈటీలు, రిటైర్డ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్ చేస్తే షీ టీంకు సమాచారం ఇవ్వాలి



ఆర్మూర్‌టౌన్: ఎవరైనా మహిళలపై అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్ చేసినా షీటీంకు సమాచారం ఇవ్వాలని షీ టీం కానిస్టేబుల్ విఘ్నేష్ అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఈవ్‌టీజింగ్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధనవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిలిండర్ వితరణ

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన నిరుపేద మహిళ దుబ్బాక లక్ష్మీకి గురువారం కాంగ్రెస్ బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి గ్యామ శోభన్ సిలిండర్‌ను వితరణ చేశారు. గ్యాస్ కనెక్షన్ పత్రాలను అందజేశారు.

గాలి వీచినా.. చినుకు రాలినా..

- లూజ్ వైర్లతో అంధకారంగా మారుతున్న గ్రామాలు
- గాలివానకు నిలిచిపోతున్న విద్యుత్ సరఫరా



రెంజల్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్

రెంజల్: చినుకు రాలినా.. గాలి వీచినా మండలంలో అంధకారం ఏర్పడుతోంది. చిన్నపాటి గాలివానకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల పాటు ఉచిత విద్యుత్‌ను అందిస్తుంటే క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ఎండాకాలంలో సాయంత్రం, రాత్రి సమయాల్లో గాలులు వీయడంతో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నారు. తీవ్ర ఉక్కపోతతో వినియోగదారులు జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. వర్షాకాలం వచ్చినా పరిస్థితిలో ఎలాంటి మార్పు ఉండదని మండల వాసులు వాపోతున్నారు.

నాలుగు సబ్‌స్టేషన్లు ఉన్నా..

మండలంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు నాలుగు ఉన్నాయి. రెంజల్, నీలా, దండిగుట్ట, తాడ్‌బిలోలి గ్రామాల్లోని విద్యుత్ ఉప కేంద్రాలు పని చేస్తున్నా ఇబ్బందులు మాత్రం తప్పడంలేదని సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాలి, వాన తగ్గినా సబ్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న ఆపరేటర్లు సకాలంలో సరఫరాను పునరుద్ధరణ చేయరని వినియోగదారులు పేర్కొంటున్నారు. సబ్‌స్టేషన్‌ల నుంచి గ్రామాలకు విద్యుత్‌ను అందించే కరెంట్ స్తంభాలు, తీగలు చాలా ఏళ్ల కిందట వేశారు. తీగలు లూజవడంతో పాటు విద్యుత్ స్తంభాల కిందనే హరితహారంలో నాటిన మొక్కలు చెట్లుగా మారి తీగలకు తగలడంతో కరెంట్ ట్రిప్పవుతోంది. దీంతో ట్రాన్స్‌కో అధికారులకు కూడా ఈ సమస్య ఇబ్బందికరంగా మారింది.

తీగలను సరిచేయాలి



లూజ్ వైర్లతోనే సమస్య ఎదురవుతోంది. ట్రాన్స్‌కో అధికారులు ముందు విద్యుత్ తీగలను సరిచేయాలి. సబ్‌స్టేషన్లకు ఫోన్ చేస్తే సిబ్బంది స్పందించడంలేదు. రాత్రి సమయంలో అంతరాయం ఏర్పడితే నిద్రకు దూరం కావాల్సి వస్తోంది. అధికారులు ఇకనైనా స్పందించి కరెంట్ సమస్య లేకుండా చూడాలి.

– నాగరాజు, కళ్యాపూర్

ముందు జాగ్రత్త చర్యగా..

సుడిగాలి వచ్చినప్పుడు ముందు జాగ్రత్త చర్య తీసుకుంటాం. చెట్ల కింద తీగలపై కొమ్మలు విరిగి పడితే 132 సబ్‌స్టేషన్‌లో ముందుగా ట్రిప్పవుతుంది. దాన్ని పరిష్కరించేందుకు సమయం పడుతుంది. అందుకే 33/11 సబ్‌స్టేషన్‌లో ముందుగా తీసివేయడం జరుగుతుంది. సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– రాజలింగం, ట్రాన్స్‌కో ఏఈ

మిషన్ భగీరథ నీటిని అందించరా?

- సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం



ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఎడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు అందక ప్రజలు అల్లాడుతున్నారని, అధికారుల నిర్లక్ష్యంతోనే ఇదంతా జరుగుతోందని మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. మండలంలోని నెహ్రూనగర్‌కు కుర్నాపల్లి జీపీ పరిధిలోని వడ్డెర కాలనీ, అంబం జీపీ పరిధిలోని ఆశానగర్, వడ్డేపల్లి జీపీ పరిధిలోని గొల్లగుడిసె గ్రామాలకు గత ఏడేళ్లుగా మిషన్ భగీరథ నీరు ఎందుకు సరఫరా చేయడం లేదని ప్రజాప్రతినిధులు, ఎంపీపీ ఎనివాస్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్ మిషన్ భగీరథ అధికారులను ప్రశ్నించారు. దీంతో పాటు మండలంలోని జైతాపూర్‌లోని రెండో వార్డులో, ఎడపల్లిలోని నాలుగో వార్డుకు కూడా మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. స్పందించిన మిషన్ భగీరథ ఏఈ గబ్బర్ సింగ్ పైఅధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం విద్యాశాఖలో చేపడుతున్న పనులపై ఎంఈవో రామారావు వివరించారు. అనంతరం మంగల్‌పాడ్ విలేజ్ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సొసైటీ గోదామును తిరిగి విండోకు అప్పగిస్తున్నట్లు కూడిన పత్రాన్ని విండో అధ్యక్షుడు పూల మల్కారెడ్డికి గ్రామస్తులు అందజేశారు. సమావేశంలో కుర్నాపల్లి ఎంపీటీసీ రాంరెడ్డి, ఎంపీడీవో శంకర్, వైద్యశాఖ సూపర్‌వైజర్ దేవేందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎంపీటీసీలు, మండల ఇన్‌చార్జి పంచాయతీ అధికారి రవిప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

జక్రాన్‌పల్లి: గ్రామీణ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా వాటికి దూరంగా ఉండాలని ఏఎస్సై సుశీల్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలో గురువారం జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, గంజాయి, ట్రాఫిక్ నిబంధనలు, సీసీ టీవీ కెమెరాల ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. సిబ్బంది శ్రీనివాస్, భూపతి, సురేష్‌గౌడ్, పాల్గొన్నారు.

వరికి బోనస్ అందించాలి



గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకుల రాస్తారోకో

బాల్కొండలో రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

బాల్కొండ/ ఆర్మూర్‌టౌన్: వరి పంటకు క్వింటాలుకు 500 చొప్పున బోనస్ వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం బాల్కొండ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల అధ్యక్షులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్, శేఖర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని నిజాంసాగర్ కెనాల్‌పై బీఆర్‌ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. రైతులను మోసం చేస్తే ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ నర్మె నవీన్, నాయకులు పూజ నరేందర్, సుంకరి రవి, గంగాధర్, రంజిత, అగ్గు క్రాంతి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

సిక్కుల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న అజిత్‌సింగ్

నవీపేట: సిక్కుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ విశేషంగా కృషి చేస్తోందని గురుద్వార్ ప్రబంధక్ బోధన్ కమిటీ అధ్యక్షుడు అజిత్ సింగ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిక్కుల ప్రభావిత ప్రాంతాలలో గురుద్వారాల ఏర్పాటుకు స్థలం కేటాయించిందని పేర్కొన్నారు. కొన్ని దశాబ్దాలుగా మండల కేంద్రంలోని మార్కెట్ స్థలంలో తాత్కాలిక నివాస గృహాల్లో తలదాచుకుంటున్న సిక్కులకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. పట్టాల జారీకి అనుకూలంగా తీర్పు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ మాజీ కార్పొరేటర్ మంజిత్ సింగ్, అమీర్‌పేట గురుద్వార్ అధ్యక్షుడు అజిత్‌సింగ్ నిషాసింగ్, సీఆర్‌పీఎఫ్ జవాన్ అర్జున్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన కల్పించాలి



సాలూరలో ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది



బోధన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

బోధన్ టౌన్/బోధన్/రెంజల్/రుద్రూర్/ పెర్కిట్ /మాక్లూర్/బాల్కొండ/భీమ్‌గల్/ ఎడపల్లి: డెంగీ ప్రబలకుండా ఉండేందుకు ఆశ కార్యకర్తలు, పారమెడికల్ సిబ్బంది బోధన్ పట్టణంలో ఇంటింటా తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య అన్నారు. డెంగీ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పాన్‌గల్లీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం అవగాహన సమావేశం నిర్వహించి, ర్యాలీ చేపట్టారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సమత, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వర్షాకాలంలో డెంగీ వ్యాధి ప్రబలే అవకాశం ఉందని దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సాలూర పీహెచ్‌సీ వైద్యాధికారిణి రేఖా సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అవగాహన సమావేశం, ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెంజల్‌లో వైద్య సిబ్బంది డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి వైద్యుడు వినయ్‌కుమార్, డాక్టర్ సహిస్తాఫిర్దోస్, ఆరోగ్య విస్తర్ణ అధికారులు శ్రావణ్‌కుమార్, రవీందర్, మాలాన్‌బీ, ఆరోగ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కోటగిరి మండల కేంద్రంలో డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో వైద్య శాఖ సిబ్బంది దోమల నివారణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. గోవింద్‌పేట్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి మానస, మామిడిపల్లి బస్తీ దవాఖాన వైద్యాధికారిణి ప్రీతి పావని, వైద్యురాలు యాస్మిన్, హెచ్‌ఈవో రవి, ఆరోగ్య కార్యకర్త జక్కుల మోహన్, ఆశావర్కర్లు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

మాక్లూర్ మండల కేంద్రంలో మండల వైద్యాధికారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్, సూపర్‌వైజర్ సుధాకర్, దేవ పాలెం పాల్గొన్నారు.

మెండోరా మండల కేంద్రంలో డెంగీ దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి ప్రణవ, పంచాయతీ కార్యదర్శి రాజుకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ మండల కేంద్రంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజయ్ పవర్, సూపర్‌వైజర్ భూలక్ష్మి, ఆర్పీ మారుతి, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మీనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎడపల్లి మండల కేంద్రంలో పీహెచ్‌సీ సిబ్బంది డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



మామిడిపల్లిలో..



మెండోరాలో..

పిచ్చి మొక్కలు తొలగించరూ..!



ఆనకట్టపై ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

- ఎస్సారెస్పీ ఆనకట్టపై ఏపుగా పెరిగిన మొక్కలు
- పట్టించుకోని అధికారులు

బాల్కొండ: ఎస్సారెస్పీ ఆనకట్టపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఇబ్బందిగా మారుతోంది. ప్రాజెక్టుకు ఇరు వైపులా పిచ్చి మొక్కలు పెరిగి చెట్లుగా ఎదుగుతున్నా అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు. కనీసం వాటిని తొలగించే పనులు చేపట్టక పోవడంతో ప్రాజెక్టు అందాలు వీక్షించే ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారుతోంది. ఆనకట్టపై మొక్కలు చెట్లుగా ఎదగడం ఆనకట్టకే ముప్పు అని పలుమార్లు జల నిపుణులు హెచ్చరించినా ప్రాజెక్ట్ అధికారులు పెడచెవిన పెడుతున్నారు. డ్యాం వద్ద పని చేసేందుకు వీఆర్‌ఏల ఉద్యోగాల సర్దుబాటులో భాగంగా అనేక మంది లష్కరులు ప్రాజెక్టుకు కేటాయించారు. దీంతో వారితో పని చేయిస్తే పిచ్చి మొక్కలు కంటికి కనిపించవు. కానీ అధికారులు వారిని ఇతర పనులకు వినియోగిస్తున్నారు.

ప్రాజెక్ట్ ఆనకట్ట కుడి, ఎడమలకు కలిపి 14 కిలోమీటర్ల పొడవున ఉంటుంది. ప్రస్తుతం ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి చెట్లుగా ఎదుగుతున్నాయి. ఇలా అయితే ఆనకట్టకు ప్రమాదం కలుగుతుందని సెఫ్టీ బృందం హెచ్చరించినా అధికారుల్లో చలనం రావడం లేదు. ఇకనైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ఆనకట్టపై పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలిగించేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై డ్యాం డిప్యూటీ ఈఈ గంగా భూషణ్‌ను వివరణ కోరగా ఆనకట్టపై పిచ్చి మొక్కలు ఎక్కడా లేవని.. శుభ్రంగా ఉందని తెలుపడం గమనార్హం.

భక్తుల కొంగు బంగారం ‘నిమిషాంబదేవి’

- నేటి నుంచి ఆలయ ఉత్సవాలు



బాల్కొండ: మండల కేంద్రంలో 522 ఏళ్ల క్రితం వెలిసిన నిమిషాంబ దేవీ భక్తుల పాలిట కొంగు బంగారంగా విరజిల్లుతోంది. ఆలయంలో శుక్రవారం నుంచి ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ, గ్రామ కమిటీ సభ్యులు, నకాశీ సంఘం సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. నకాశీ సంఘం ఆధ్వర్యంలో ఆలయం అభివృద్ధి చెందుతోంది. శనివారం అమ్మ వారి జన్మదినం సందర్భంగా ఉత్సవాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆలయ ప్రాంగణంలో యజ్ఞం, బోనాల ఊరేగింపు, పలు కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని వారు కోరారు.

నేటి నుంచి ప్రత్యేక పూజలు

రుద్రూర్: మండల కేంద్రంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం నుంచి వైశాఖ మాస ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్ పహడే, లోగం సురేశ్ గురువారం తెలిపారు. దేవాంగ సంఘం ఆధ్వర్యంలో అమావాస్య వరకు ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

సమన్వయంతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సునీత


రుద్రూర్: సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని కోటగిరి ఎంపీపీ వల్లెపల్లి సునీతశ్రీనివాస్ అన్నారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను సమీక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలో అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో అధికారుల కృషి బాగుందని అభినందించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎంపీటీసీలు, జీపీ ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా వెలిసిన కోకా తొలిగింపు



నవీపేట: మండలంలోని జన్నేపల్లిలోని మాటు కాలువ పరిధిలో రెండు రోజుల క్రితం అక్రమంగా ఏర్పాటు చేసిన కోకాను అధికారులు గురువారం తొలగించారు. గ్రామానికి చెందిన నాగేశ్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండానే ఇరిగేషన్ స్థలంలో రేకులతో నిర్మించిన కోకాను ఏర్పాటు చేయడంతో స్పందించిన అధికారులు, సిబ్బంది సదరు వ్యక్తికి హెచ్చరికలు జారీ చేశారు. హెచ్చరికలను బేఖాతరు చేయడంతో పోలీసుల సహకారంతో ఇరిగేషన్ ఏఈ శ్రీధర్, జీపీ కార్యదర్శి కవితల ఆధ్వర్యంలో కోకాను తొలగించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 01.20, ఆరంభం (తెలుగు) - 4.15, ప్రసన్న వదనం (తెలుగు) - 7.10, బ్రహ్మచారి (తెలుగు) 10.15
స్క్రీన్-2 –	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ - 11.45, 2.55, 6.05, 9.15
స్క్రీన్-3 –	ప్రతినిధి-2 (తెలుగు) - 12.15, 6.20, 9.15, బాక్ (తెలుగు) - 3.10
స్క్రీన్-4 –	కృష్ణమ్మ (తెలుగు)- 12.45, 3.40, 6.35, 9.30

కలెక్టర్‌కు అభినందనల వెల్లువ



కలెక్టర్‌ను సన్మానిస్తున్న, టీఎన్జీవోస్ ప్రతినిధులు

నిజామాబాద్‌నాగారం/నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కలిసి, అభినందనలు తెలిపారు. టీఎన్జీవోస్, ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇటీవల జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించుటకు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న జిల్లా ఉద్యోగ మిత్రులకు, కలెక్టర్ ప్రత్యేక చొరవతో అన్ని రకాల వసతులతోపాటు, భోజన సదుపాయాలు అద్భుతంగా కల్పించారన్నారు. దీంతో ఆయనను సన్మానించినట్లు తెలిపారు. జిల్లా చైర్మన్ అలుక కిషన్ మాట్లాడుతూ.. గత డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికలు, ఇటీవల జరిగిన లోకసభ ఎన్నికల్లో నెలరోజుల పాటు ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులు, ఉద్యోగులందరికీ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రెవెన్యూ ఉద్యోగులకు చెల్లించిన విధంగా ఒక నెల వేతనం చెల్లించవలసిందిగా కోరారు. వైస్‌చైర్మన్ అమత్‌కుమార్, నేతికుంట శేఖర్, చిట్టి నారాయణరెడ్డి, పోల శ్రీనివాస్, దేవిసింగ్, ఆకుల ప్రసాద్, పురుషోత్తం, జాఫర్ హుస్సేన్, జాకీర్ హుస్సేన్, సత్యం, ఉమా కిరణ్ ఉన్నారు.

రైతు పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి



నిజామాబాద్‌నాగారం: సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అని, ఎన్నికల కోడ్ ముగియగానే రైతులకు రూ. 2లక్షల రుణామాఫీ చేయడానికి కసరత్తులు చేస్తున్నారని ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గోర్కంటి లింగన్న అన్నారు. రుణమాఫీ విషయంలో సీఎం ప్రత్యేకంగా బ్యాంకు అధికారులతో మాట్లాడి ముందడుగు వేసిన సందర్భంగా ఆయనకు ధన్యవాధములు తెలిపారు. నగరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా ఇచ్చిన మాట ప్రకారం సీఎం కృషి చేస్తున్నారన్నారు. వరి ధాన్యం కొనుగొలు పకడ్బందీగా చేపట్టారన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందించడానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. బాడ్సీ పీఏసీసీఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ సాయన్న తదితరులు పాల్గొన్నారు.